సాక్షి విజయనగరం

శనివారం । 23 । మార్చి । 2024



టీడీపీ నేత చెత్తపని..!

అధికార బలంతో ఆ టీడీపీ నేత రెచ్చిపోయాడు. నిబంధనలను తుంగలో తొక్కి.. ఓ 'చెత్త'పనికి పూనుకున్నాడు. -IIలో



చెరకు తోటలు దగ్ధం -IIలో

బాడంగి మండలం పి.వెంకయ్యపేట గ్రామంలో సుమారు 4 ఎకరాల్లోని మమ్ము చెరకు పంట శుక్రవారం కాలిపోయింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని (సా॥)	ఆది (ఉ॥)
6.13	4.36

న్యూస్‌రీల్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసులు

- నేటి వరకు 12 కేసుల నమోదు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదుచేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో శుక్రవారం వరకు 12 ఉల్లంఘన కేసులను నమోదు చేసినట్టు ఆమె చెప్పారు. వీటిలో ఎస్.కోట నియోజకవర్గంలో 3, రాజాంలో రెండు, నెల్లిమర్లలో 2, చీపురుపల్లి, బొబ్బిలిలో ఒక్కొక్కటి, విజయనగరం నియోజకవర్గంలో 3 కేసులను పోలీస్‌లు నమోదు చేశారన్నారు.

నివేదికలు పక్కాగా ఉండాలి

- కాల్ సెంటర్ ద్వారా ఓటుపై ఆరా


విజయనగరం అర్బన్: కంట్రోల్ రూమ్ నుంచి పంపే నివేదికలు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లోని అన్ని విభాగాలను శుక్రవారం తనిఖీ చేశారు. మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా, 24/7 కాల్ సెంటర్, ఎంసీసీ విభాగం, రిపోర్టింగ్ విభాగాలను తనిఖీచేసి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. విధులపై ఆరా తీశారు. కాల్ సెంటర్ 08922-797120, 08922-797124కు ఫోన్ చేసి, ఓటర్లు తమపేరు ఓటర్ల జాబితాలో ఉందోలేదో తెలుసుకోవచ్చన్నారు. కలెక్టర్ వెంట జేసీ కార్తీక్, సీపీఓ బాలాజీ, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్ నిర్మలాదేవి, ఎంసీసీ నోడల్ అధికారి అరుణశ్రీ, డీపీఆర్‌ఓ రమేష్ పాల్గొన్నారు.

సమయపాలనే విజయానికి సోపానం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న క్యాప్‌జెమినీ వైస్ ప్రెసిడెంట్ వసంత

రాజాం సిటీ: సమయపాలనే విజయానికి సోపానమని, విద్యార్థులు చక్కని నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని బెంగుళూరుకు చెందిన క్యాప్‌జెమినీ వైస్ ప్రెసిడెంట్ వసంత సూచించారు. స్థానిక జీఎంఆర్ ఐటీ 26వ వార్షికోత్సవానికి ఆమె శుక్రవారం హాజరయ్యారు. విద్యార్థులు మంచి మూర్తిమత్వంతో ప్రపంచాన్ని జయించగలరని పేర్కొన్నారు. విద్యతోపాటు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. తను కూడా ఇదే కళాశాల విద్యార్థినని, ఇక్కడ నేర్చుకున్న అంశాలను నిత్య జీవితంలో ఉపయోగిస్తున్నానని గుర్తుచేశారు. బెంగుళూరుకు చెందిన కాగ్నిజెంట్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ హెడ్ అశ్వథీవేణుగోపాల్ మాట్లాడుతూ 2047 నాటికి భారత్ గొప్ప ఆర్థిక శక్తిగా ఎదగడానికి మనమంతా కృషిచేయాల్సిన ఆవశ్యకత ఉందని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం సాంకేతికతతోపాటు కృత్రిమ మేథస్సు అందుబాటులోకి వచ్చిందని, ఆ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నమ్మించడం.. పూర్తిస్థాయిలో వాడుకోవడం.. ఖర్చుచేయించడం.. అవసరం తీరాక నట్టేట ముంచేయడం చంద్రబాబు నైజం. ఆయన వలలో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలువురు నాయకులు చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. తండ్రీకొడుకుల తీరును దుమ్మెత్తిపోస్తున్నారు. తమకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసేవారికి అదే గతి పట్టిస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు.

ముంచేశావా బాబూ..!

- చంద్రబాబు బాధితుల్లో చేరిన గొంప కృష్ణ
- శృంగవరపుకోట టీడీపీ టికెట్‌పై ఆశాభంగం
- చివరి నిమిషంలో చంద్రబాబు ఝలక్
- మూడో జాబితాలో కోళ్ల లలితకుమారి పేరు
- చీపురుపల్లి, ఎచ్చెర్ల, పాలకొండ అభ్యర్థులెవరనేదీ సందిగ్ధత
- టికెట్ కోసం కిమిడి కుటుంబానికి తప్పని అగచాట్లు
- సీనియర్ నాయకుడు కళావెంకటరావుకు తీవ్ర అవమానం
- నమ్మకద్రోహంతో నిమ్మక జయకృష్ణ నైరాశ్యం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 175/175 లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు, అనకాపల్లి మినహా అన్ని లోక్‌సభ స్థానాలకు ఒకేసారి అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన షాక్ నుంచి చంద్రబాబు ఇప్పట్లో తేరుకొనేలా కనిపించట్లేదు. ఓ వైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా ప్రజాక్షేత్రంలో యుద్ధానికి ఇప్పటికే 'సిద్ధం' అయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 58 నెలల సంక్షేమ, అభివృద్ధి పాలన ఫలాలను అందుకున్న ప్రజలు వారికి ఘనస్వాగతం పలుకుతున్నారు. మరోవైపు జనసేన, బీజేపీలతో జతకట్టినా టీడీపీ క్యాడర్ పరిస్థితి ఇప్పటికీ డోలాయమానంలోనే ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో చావుదెబ్బ తగిలిన టీడీపీని బతికించుకోవడానికి ప్రయత్నించిన నాయకులకే ఇప్పుడు చంద్రబాబు ఝలక్‌ల మీద ఝలక్‌లు ఇస్తున్నారు. ఒకటీ.. రెండు.. మూడు..

కరివేపాకులా 'కిమిడి' కుటుంబం

ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించిన కిమిడి కళావెంకటరావు ఇప్పుడు కూరలో కరివేపాకు అయిపోయారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేసిన ఆయనే ఇప్పుడు విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎచ్చెర్ల అసెంబ్లీ టిక్కెట్ కోసం వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చేసింది. మూడో జాబితాలోనూ ఆయన పేరు లేకపోవడంతో కళా అభిమానులు కళావిహీనమైపోయారు. విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా ఇన్నాళ్లు టీడీపీ జెండా మోసిన కళా సోదరుడి కుమారుడు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని వారసుడు నాగార్జున పరిస్థితి కూడా కరివేపాకు కన్నా అధ్వానంగా మారిపోయింది. చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి బొత్స సత్యనారాయణను ఢీకొట్టడం నీ వల్ల కాదులే అని చంద్రబాబే పరోక్షంగా తేల్చిచెప్పేశారు. ఎన్నికలకోసారి నియోజకవర్గం మార్చే ప్యారాచ్యూట్ లీడర్ గంటా శ్రీనివాసరావును పంపడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఇదేమాత్రం నాగార్జునకు మింగుడుపడకపోయినా గొంతు ఎత్తలేని పరిస్థితి.

ఇలా ఏ జాబితా చూసినా చంద్రబాబు చేతిలో మోసపోయిన బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తాజాగా శృంగవరపు కోట టికెట్ ఆశించిన గొంప కృష్ణ కూడా ఆ లిస్టులో చేరారు. కోళ్ల లలితకుమారి టికెట్‌ను తన్నుకుపోవడంతో లబోదిబోమనడం ఆయన వంతు అయ్యింది.

ఆశావహులకు నిరాశ..

ఇప్పటికే టీడీపీ ప్రకటించిన తొలి రెండు జాబితాలతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలామంది ఆశావహులకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. సీనియర్ నాయకుడు పతివాడ నారాయణస్వామినాయుడిని కాదని నెల్లిమర్ల అసెంబ్లీ టికెట్ ఇస్తామంటూ భోగాపురం మాజీ ఎంపీపీ కర్రోతు బంగార్రాజును చంద్రబాబు మునగచెట్టు ఎక్కించారు. సాక్షాత్తూ అధ్యక్షుడే హామీ ఇచ్చిన తర్వాత తనకు తిరుగులేదని భ్రమపడిన బంగార్రాజు... పార్టీ కార్యక్రమాలకు చేతిచమురు బాగానే వదిలించుకున్నారు. ఖర్చుల కోసం, పార్టీకి ఎన్నికల నిధి చూపించడానికి చివరకు జనసేన నాయకురాలు లోకం మాధవి వద్ద కూడా భారీగానే అప్పులు చేశారనే వదంతులు బాగానే షికారు చేశాయి.

కారణం ఇదో, మరి ఇంకేదో కానీ పార్టీ అధిష్టానం తనకు మొండిచేయి చూపించినా కిమ్మనలేదు. విజయనగరం లోక్‌సభ టికెట్ ఇస్తామని కాసేపు, భీమిలి అసెంబ్లీ టికెట్ ఇస్తామని కాసేపు మరోసారి అరచేతిలో వైకుంఠం చూపించినా ఆశపడ్డారే తప్ప తనకు జరిగిన అన్యాయంపై గళం వినిపించలేని సంకటస్థితి ఎదురైంది.

- గజపతినగరం అసెంబ్లీ టిక్కెట్ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడును కాదని ఆయన సోదరుడి కుమారుడు కొండపల్లి శ్రీనివాస్‌కు ఇచ్చేసి చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. పార్టీకి సేవలకన్నా పైసలున్న వాడికే పెద్దపీట వేశారని, తనకు అన్యాయం చేశారని కేఏ నాయుడు లబోదిబోమంటున్నారు. ఆయన ఆవేదన అరణ్యరోదనే అవుతోంది.
- బొబ్బిలి టిక్కెట్‌ను ఆశించిన కొప్పుల వెలమ సామాజికవర్గ నాయకులను చంద్రబాబు చావుదెబ్బ తీశారు. ఓసీ వెలమ సామాజికవర్గానికి చెందిన బేబీనాయన కోసం కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడి రాజకీయ భవిష్యత్తుపై చావుదెబ్బ కొట్టారు. అతన్ని ఊరడించడానికి గజపతినగరం టికెట్ ఇస్తామంటూ లీక్‌లిచ్చినా చివరకు అవే మిగిలాయి. బొబ్బిలిలోనే కాదు విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎక్కడా కొప్పుల వెలమ నాయకులకు చంద్రబాబు టిక్కెట్ ఇవ్వలేదు.
- పార్వతీపురంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులను పక్కనబెట్టేసి సొమ్ము దండిగా ఉన్న విజయచంద్రను కొత్తగా తెరపైకి తెచ్చారు. తూర్పుకాపు సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు మరోసారి భంగపాటు తప్పలేదు.
- టీడీపీ శుక్రవారం ప్రకటించిన మూడో జాబితాతో గొంప కృష్ణ కొంప కూల్చేశారు. చంద్రబాబు, లోకేష్ తనకు మాట ఇచ్చారని, శృంగవరపుకోటలో టీడీపీ టిక్కెట్ తనదేనంటూ ఇన్నాళ్లూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న కృష్ణకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. చావుదెబ్బతిన్న టీడీపీకి ఊపిరిపోసినందుకు తమకే గొయ్యి తవ్వారని అతని అనుచరులంతా లబోదిబోమంటున్నారు.

నైరాశ్యంలో నిమ్మక...

పాలకొండలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు విశ్వాసరాయి కళావతి చేతిలో వరుసగా ఓడిపోతున్నా మొక్కవోని ధైర్యంతో పార్టీ కోసం కష్టపడిన నిమ్మక జయకృష్ణ పరిస్థితి త్రిశంకుస్వర్గంలా మారింది. పాలకొండ జనసేన పార్టీకి ఇచ్చేస్తారనే వదంతులతో తనకు సీటు వస్తుందో, రాదో తెలియక తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదీ చంద్రబాబును నమ్ముకున్న ఆ పార్టీ నాయకుల పరిస్థితి.

తొడకొట్టిన 'గ్రీష్మ'కు మొండిచేయి...

వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు బస్సుయాత్రకు వస్తే ఈడ్చి తంతానంటూ తొడకొట్టి మరీ మహానాడులో చంద్రబాబు ముందు సవాలు చేసిన కావలి గ్రీష్మ ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. టీడీపీలో సీనియర్ నాయకురాలైన ఆమె తల్లి కావలి ప్రతిభా భారతి సేవలు కూడా అక్కరకు రాకుండా పోయాయి. కోట్లు ఖర్చుపెడతానంటూ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన కోండ్రు మురళీమోహన్‌కే రాజాం టీడీపీ టికెట్ దక్కింది.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా గొంప కృష్ణ

- తన అనుచరవర్గంతో సమాలోచన
- రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక
- టీడీపీని బతికించిన వాడికే చంద్రబాబు, లోకేశ్ గొయ్యితీశారు..
- అనవసర కామెంట్స్ చేస్తే ఇంటికి వెళ్లి తన్నేందుకు సిద్ధం



శృంగవరపుకోట తన పార్టీ కార్యాలయంవద్ద నాయకులు, కార్యకర్తలు అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న యువనేత గొంప కృష్ణ

శృంగవరపుకోట: మీ అందరి అభిప్రాయం మేరకు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు నేను సిద్ధమని నియోజకవర్గ యువనేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ శుక్రవారం సాయంత్రం ఎస్.కోటలోని తన కార్యాలయంలో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న తనకు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్.కోట టికెట్ కేటాయించినట్టు టీడీపీ అధిష్టానం నుంచి ఫోన్ వచ్చిందన్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో విడుదలైన జాబితాలో తన పేరు లేదన్నారు. వాస్తవంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ల ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చి అనతి కాలంలోనే మీ అందరి అభిమానంతో నియోజకవర్గంలో నాయకునిగా ఎదిగానన్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేస్తూ వచ్చామని, ఎవరెన్ని అవమానాలకు గురిచేసినా భరించానని తెలిపారు. ఇన్నాళ్లు నాతో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏది చెబితే దానికి సిద్ధమని స్పష్టంచేశారు. ఎస్.కోటలోనే ఉండి మీ అందరి కష్టాసుఖాల్లో తోడుగా ఉంటానన్నారు. అవసరమైతే చంద్రబాబు, లోకేశ్‌ల బొమ్మను పెట్టుకుని వేరే గుర్తుతో ఇండిపెండెంట్‌గా పోటీకి వెళ్దామన్నారు. గొడవ పెట్టుకోవాలంటే నిముషం పట్టదని, తనను కవ్వించేలా కామెంట్స్ పెట్టినా పార్టీ ఆదేశాల ప్రకారం అన్ని భరించామని, ఇకపై కామెంట్ చేసేవారిని ఇంటికి వెళ్లి తన్నడానికి సిద్ధమన్నారు. పార్టీ సీనియర్ నాయకులు రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవి, గొరపల్లి రాము, ఇప్పాక త్రివేణి, గుమ్మడి భారతి, పైడిబాబు తదితరులు మాట్లాడుతూ ఎస్.కోటలో చచ్చిపోతున్న టీడీపీకి గొంప కృష్ణ ఊపిరిపోశారని, అలాంటి నాయకుడికి టీడీపీ అధిష్టానం మోసం చేసిందన్నారు. నాయకులందరం చర్చించుకుని గొంప కృష్ణను ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దించుదామన్నారు. కొందరు టీడీపీ కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి ఉన్న తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తును పెయింట్‌తో చెరిపేశారు.

పదవికి గొంపకృష్ణ రాజీనామా

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంప కృష్ణ గురువారం సాయంత్రం రాజీనామా చేశారు. ఆయనతో పాటు పార్టీ వేపాడ, కొత్తవలస, జామి మండలాధ్యక్షులు గొంప వెంకటరావు, గొరపల్లి రాము, లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి వారి పదవులకు రాజీనామా చేశారు.

జోరుగా బెట్టింగ్‌లు

ఎస్.కోట టీడీపీ అభ్యర్థి ఎవరనేదానిపై గత రెండు రోజులుగా జోరుగా బెట్టింగ్‌లు సాగాయి. ఓ గ్రూపుగా ఏర్పడి రూ.5లక్షలు, ఓ రియల్టర్ రూ.2లక్షలు, ఓ వ్యాపారి రూ.లక్షలు, మరికొందరు మద్యం కోసం పందెం కాశారు.

నెల్లిమర్ల టీడీపీలో చీలిక!

- వర్గాలుగా విడిపోయిన వైనం
- జనసేన అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి బంగార్రాజు వర్గం డుమ్మా
- పతివాడ వర్గమే హాజరు
- బంగార్రాజును పక్కనపెట్టేందుకు యత్నాలు..!



పూసపాటిరేగ: నెల్లిమర్ల టీడీపీ రెండు వర్గాలు చీలిపోయిందన్న ప్రచారం జోరందుకుంది. దీనికి చల్లవానిపేటలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల పరిచయ కార్యక్రమం, అక్కడి నేతల ప్రసంగాలు బలం చేకూర్చుతున్నాయి. తొలినుంచి నెల్లిమర్ల టీడీపీలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు మధ్య వర్గపోరు నడుస్తోంది. పార్టీ టికెట్ ఆశించిన బంగార్రాజు ఖర్చుకు వెనుకాడకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపారు. చంద్రబాబు, లోకేశ్‌లను భుజాలపై మోశారు. వారి పర్యటనలు విజయవంతానికి అంతాతానై కృషిచేశారు. ఇంత చేసినా ఆయన ఆశలపై నీళ్లుచల్లుతూ జనసేనతో పొత్తులో భాగంగా టికెట్‌ను లోకం మాధవికి కేటాయించారు. అప్పటి నుంచి బంగార్రాజు కుంగిపోతున్నారు. పార్టీ అధిష్టానాన్ని కలిసినా ఫలితం లేకపోవడంతో తన ఆవేదనను తన అనుచరవర్గం వద్ద తరచూ వ్యక్తంచేస్తున్నారు. ఇంతలో కర్రోతు వ్యతిరేక వర్గం ఉమ్మడి అభ్యర్థికి దగ్గరైంది. కర్రోతును పూర్తిగా పక్కన పెట్టేలా పావులు కదుపుతున్నట్టు సమాచారం. దీంతో ఆయన భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. మాధవి గెలుపునకు కృషిచేస్తే భవిష్యత్తులో టీడీపీ అభ్యర్థులకు టికెట్టే ఉండదన్న అనుమానమూ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. కర్రోతు నిర్ణయం కోసం అనుచరవర్గం ఎదురుచూస్తోంది. చల్లవానిపేట తోటలో పతివాడ నారాయణస్వామి నాయుడు స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశానికి బంగార్రాజుతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దంగా భూలోక, టీడీపీ రాష్ట్రబీసీ సెల్ కార్యవర్గ సభ్యులు మైలపల్లి సింహాచలం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, రెల్లివలస సర్పంచ్ భర్త ఇజ్జురోతు ఈశ్వరరావు హాజరుకాలేదు. పరోక్షంగా బంగార్రాజుకు మద్దతు తెలిపారు. పతివాడతో పాటు డెంకాడ, పూసపాటిరేగ మండలాల టీడీపీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, ఎంవీజీ శంకరరావు, మాజీ ఎంపీపీలు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖరరావు, గేదెల రాజారావు హాజరయ్యారు.

విజయమే లక్ష్యంగా..



విజయనగరం బాబామెట్ట ప్రాంతంలో ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్న డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

- విజయనగరంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కోలగట్ల
- నగరంలోని బాబామెట్ట ద్వారకానగర్ నుంచి ప్రచారానికి శ్రీకారం
- ఇంటింటికీ వెళ్లి మద్దతు తెలియజేయాలంటూ అభ్యర్థన
- మొదటి రోజు హారతులు, పూలదండలతో ఘన స్వాగతం పలికిన ప్రజలు

విజయనగరం: విజయనగరం నియోజకర్గంలో గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు... ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్షగా.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ బాబామెట్ట ద్వారకానగర్ ప్రాంతంలో స్థానిక నాయకుడు కేఏపీ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారానికి కోలగట్ల శ్రీకారం చుట్టారు. నగరంలో ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని, నీతివంతమైన పాలన చూసి మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ద్వారకానగర్ ప్రాంతానికి చేరుకున్న కోలగట్లకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో సాదరంగా ఆహ్వానించారు. ఆయనపై పూల వర్షం కురిపించారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ సంక్షేమ పథకాల నిధులు నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేయడం దేశంలో మరెక్కడా లేదన్నారు. నియోజకవర్గ పరిధిలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుకలు, వైఎస్సార్ చేయూత వంటి అనేక రకాల ప్రజాప్రయోజన సంక్షేమ పథకాలు అమలుచేసినట్టు వెల్లడించారు. తనను మరోసారి శాసన సభ్యుడిగా అవకాశాన్ని ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చారు. సామాన్యుడి పాలన ఏ విధంగా ఉంటుందో ఐదేళ్ల కాలంలో చేసి చూపించామన్నారు. ద్వారకా నగర్ ప్రాంతంలో కోటి రూపాయలతో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో ప్రజలు హర్షించి తనకు అఖండ స్వాగతాన్ని పలికారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారికి అందుబాటులో అవసరమైన సేవలను అందిస్తున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీర వెంకటరాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, కార్పొరేటర్లు గాదం మురళి, ఆల్తి సత్యకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కోరాడ సూర్య ప్రభావతి, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

ముసుగు దొంగలొస్తారు.. జాగ్రత్త



మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమక్షంలోపార్టీలో చేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



దేవరపాదిలాంలో మంత్రి బొత్స సత్యనారాయణకు హారతులిస్తున్న మహిళలు

- చంద్రబాబుది మోసకారి తనం
- ఎన్నికల ప్రచారంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఐదేళ్ల కనిపించకుండా ఎన్నికలు వచ్చేసరికి ముసుగు దొంగలు వస్తున్నారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఉండాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. చీపురుపల్లి మండలంలోని దేవరపాదిలాం గ్రామంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి సీఎం కావడం రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది ప్రజలకు అవసరమని చెప్పారు. ఎన్నికల ముందు సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మన రాష్ట్రంలో అమలు చేశారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏది చెబుతారో అదే చేస్తారని, ఒక్క రూపాయి అవినీతి లేకుండా ఒక్క దేవరపాదిలాం గ్రామానికే సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు రూ.5 కోట్లు పంపిణీ జరిగిందని గుర్తు చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఉందని, అప్పుడు ఇక్కడ ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నావారు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఎప్పుడూ ప్రజల కోసం పని చేయలేదని, రాబోయే ఎన్నికల్లో ప్రతి ఇంటికి మేలు జరిగిందనుకుంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీకి అభ్యర్థి కరువు

ప్రచార కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీకి చీపురుపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి కరువయ్యారని ఎద్దేవా చేశారు. గతంలో 600 హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ ఆరు గ్యారంటీలతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలకు మంచి చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు.

టీడీపీ కార్యకర్తలు ఆత్మ విమర్శ చేసుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు ఎక్కడికి వెళ్లాలో తెలియక సతమతమై ఉన్నారని, అందుకనే ఆత్మవిమర్శ చేసుకుని అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎల్లో మీడియా ద్వారా వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు చూస్తున్నారని భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

10 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

దేవరపాదిలాం గ్రామంలో పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ చినిపిల్లి సింహాచలంతో పాటు టీడీపీకి చెందిన ఆర్.రమణ, ఎస్.మహేష్, జి.ఆది, టి.నాగేశ్వరరావు, జె.ఫల్గుణ, పి.రామకృష్ణ, గొల్ల, డి.చిట్టప్పడు, ఎన్.సింహాద్రి కుటుంబాల వారు మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ లక్ష్మణ, గోవింద్, శ్రీనుబాబు, టి.కృష్ణ, చింతాడ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత చెత్తపని..!

- లక్కిడాంలో పారిశుద్ధ్య సమస్య
- సొంత స్థలంలో 2017–18లో సంపద తయారీ కేంద్రం నిర్మాణం
- పంచాయతీకి అప్పగించని వైనం
- రూ.3.63 లక్షల ప్రజాధనం దుర్వినియోగం
- చెత్తను రోడ్డుపైనే వేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం



టీడీపీ నాయకుడి సొంత స్థలంలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం

గంట్యాడ: అధికార బలంతో ఆ టీడీపీ నేత రెచ్చిపోయాడు. నిబంధనలను తుంగలో తొక్కి.. ఓ 'చెత్త' పనికి పూనుకున్నాడు. అప్పటి అధికారులు కూడా ఆయనకు వంతపాడారు. ఫలితం.. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది. ప్రజలకు 'చెత్త'కష్టాలు వీడడంలేదు. టీడీపీ హయాంలో లక్కిడాం గ్రామంలో నిర్మించిన సంపదతయారీ కేంద్రం దీనికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా...

లక్కిడాం గ్రామానికి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం 2017–18లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైంది. రూ.3.63లక్షల ఉపాధి హామీ నిధులతో దీనిని నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ స్థలంలో నిర్మించాల్సిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని టీడీపీలో అప్పట్లో కీలక పదవిలో ఉన్న ఓ నేత తన సొంత స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. తర్వాత కేంద్రాన్ని పంచాయతీకి అప్పగించ లేదు. పలుమార్లు పంచాయతీకి అప్పగించాలని పంచాయతీ అధికారులు కోరినా.. నా ఇష్టం... ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సదరు నేత సమాధానం చెప్పడం గమనార్హం. సొంత స్థలంలో సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి అనుమతులు ఎలా మంజూరు చేశారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సొంత స్థలంలో నిర్మించడం వల్లే అతని నుంచి కేంద్రాన్ని స్వాధీనం చేసుకోలేకపోతున్నామని పంచాయతీ అధికారులు వాపోతున్నారు. స్థలం లేక లక్కిడాంలో సేకరించిన చెత్తను రోడ్డుపైనే పారిశుద్ధ్య సిబ్బంది డంప్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాల వల్ల వచ్చే గాలిని పీల్చడం వల్ల ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని వాపోతున్నారు.

అప్పగించ లేదు

2017–18 కాలంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆ కేంద్రాన్ని పంచాయతీకి అప్పగించలేదు. ప్రజాధనంతో సొంత స్థలంలో నిర్మించడం తప్పు. అప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారో తెలియడం లేదు. ఇప్పుడు ఆ కేంద్రాన్ని అప్పగించేందుకు ఆయన ససేమిరా అంటున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకుంటాను.

– సుందరరావు, ఏపీఓ, ఉపాధిహామీ పథకం

తు.చ తప్పకుండా

- ఎన్నికల నియమావళి పాటించాల్సిందే
- కలెక్టర్ నిషాంత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎన్నికల కమిషన్ ఆదేశాలను వెల్లడించారు. ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలా ఫలకాలు తదితర అంశాలలో ఉన్న ఫొటోలకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సమయంలో ఏర్పాటు చేసిన నిర్మాణ శిలాఫలకాలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన కార్డులు మొదలైన వాటిలో ముఖ్యమంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, సందేశాలు ఉండరాదని పేర్కొన్నారు.

పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరి

ప్రతిపాదిత సమావేశాల వేదిక, సమయం గురించి సకాలంలో స్థానిక పోలీసు అధికారులకు తెలియజేయాలి. అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలి.

- ప్రతిపాదిత సమావేశం జరిగే ప్రదేశంలో నిర్బంధ, నిషేధ ఉత్తర్వులు అమలులో ఉంటే, వాటిని గౌరవించాలి. మినహాయింపులు అవసరమైతే తప్పనిసరిగా దరఖాస్తు చేసి అనుమతులు సకాలంలో పొందాలి.
- ప్రతిపాదిత సమావేశాల కోసం లౌడ్‌స్పీకర్లు, ఇతర సౌకర్యాల వినియోగానికి తప్పనిసరిగా అనుమతి పొందాలి.
- ఊరేగింపు ప్రయాణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండాలి.

ఆంక్షలు పాటించాల్సిందే..

ప్రచార సమయంలోను, పోలింగ్ రోజున వాహనాల రాకపోకలపై ఆంక్షలు పూర్తిగా పాటించాలి.

- ఓటర్లు, అభ్యర్థులు, వారి ఎన్నికల/పోలింగ్ ఏజెంట్లు మినహా ఎన్నికల సంఘం నుంచి నిర్దిష్ట చెల్లుబాటయ్యే అధికార లేఖ ఉన్న వ్యక్తులు మాత్రమే ఏదైనా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి.
- నియోజకవర్గం నుంచి ఓటరు, అభ్యర్థి లేదా అభ్యర్థి ఎన్నికల ఏజెంట్ మినహా ఇతరులు ప్రచార వ్యవధి ముగిసిన తర్వాత నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలి.
- ఓటరుకు ఎలాంటి ప్రేరేపణ, ఆర్థిక లేదా ఇతరత్రా బహుమతులు అందించరాదు.
- ఓటర్ల కుల, వర్గ భావాలను ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించరాదు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా ఏదైనా ప్రార్థనా స్థలాన్ని ప్రచారానికి ఉపయోగించరాదు.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం నేరం.
- పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, 48 గంటల వ్యవధిలో బహిరంగ సభలు నిర్వహించడం అనైతికం.
- ఓటర్లను పోలింగ్ స్టేషన్‌కు, బయటకు తరలించడం నిషేధం.
- ఉదయం 6 గంటలకు ముందు..రాత్రి 10గంటల తర్వాత ప్రచారం బంద్
- స్టాటిక్ లేదా కదిలే వాహనాలపై అమర్చిన లౌడ్ స్పీకర్లను ఉదయం 6 గంటలకు ముందు..రాత్రి 10 గంటల తర్వాత ఉపయోగించరాదు.
- సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులలో లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదు. సమావేశాలు, ఊరేగింపులు రాత్రి 10 గంటల తర్వాత కొనసాగించడానికి అనుమతి లేదు.
- ఎన్నికల సమయంలో మద్యం పంపిణీ చేయరాదు.

క్లుప్తంగా

ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: రోడ్లు, తాగునీరు సదుపాయం కల్పించమని కోరుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావుకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన గిరిజన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లాలోని ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన నాయకులు విజయనగరంలో గల ఎస్టీ కమిషన్ క్యాంప్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస మండలం తర్లకోట పంచాయతీ గిరిజన గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం విల్లుపురం పంచాయతీ గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి..మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు వరహాల కృష్ణారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుతోటలు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన చెరకు పంట

బాడంగి: మండలంలోని పి.వెంకయ్యపేట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు రైతులకు చెందిన సుమారు 4 ఎకరాల్లోని మమ్ము చెరకు పంట శుక్రవారం కాలిపోయింది. ఈ మేరకు బాధిత రైతులు పూడిశంకర రావు, గంగరాజు, మరడాన లక్ష్మణ, అల్లుసత్యనారాయణ, గంటసత్యనారాయణ, మూడడ్ల అప్పలనాయుడులు మాట్లాడుతూ అగ్నిప్రమాదం ఎలా జరిగిందో స్పష్టంగా తెలియనప్పటికీ ఆస్తినష్టం సుమారుగా రూ.లక్షన్నర వరకు ఉంటుందని వాపోయారు. చెరకు క్రషింగ్ చేసి బెల్లంతయారీ చేసుకునేందుకు తయారవుతున్న తరుణంలో కటింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు రైతుల తరపున గ్రామసర్పంచ్ ప్రతినిధి మూడడ్ల శంకరరావు చెప్పారు. ప్రమాద సమాచారం మేరకు డొంకినవలస నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు



గాయాలపాలైన వాసు

సీతానగరం: రాష్ట్రరహదారిలో చినభోగిలి–సీతానగరం గ్రామాల మధ్య శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై సీతానగరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని చిన భోగిలి గ్రామానికి చెందిన చుక్క వాసు మోటార్ సైకిల్‌పై పార్వతీపురం వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న మరో ద్విచక్రవాహన చోదకుడు వాసు బైక్‌ను ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడు వాసును కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

క్రీడాకారులకు అభినందనలు

- జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రాణించాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ పాటవాలతో రాణించి, పతకాలు సాధించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విజయనగరం క్రీడాకారులు బి.సాయి చైతన్య, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కోట హర్షిత, కె.హితలు శుక్రవారం కోలగట్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విజయనగరం వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందని కోలగట్ల అన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కచ్ డి.వి.చారిప్రసాద్, కోచ్‌లు అనిల్ కుమార్‌శర్మ, ఎం.సతీష్‌కుమార్, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

చైన్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైన్ దొంగిలించిన ఇద్దరు నిందితులను చోరీ చేసిన చైన్, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని తోటపాలానికి చెందిన బంక గురుమూర్తమ్మ ఎయిమ్స్ స్కూల్ వెనుక భాగంలో గురువారం పశువులను మేపుతుండగా అక్కడికి వచ్చిన అపరిచిత వ్యక్తి యోగక్షేమాలు అడుగుతున్నట్లు నటించి, చుట్టుపక్కల ఎవరూ లేరని నిర్ధారించుకుని వృద్ధురాలి మెడలో బంగారు చైన్ లాక్కున్నాడు. తర్వాత కొద్దిదూరంలో ఉన్న మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఉండగా ఇద్దరూ కలిసి పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై జె.తారకేశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు. నేరానికి పాల్పడిన నిందితులను పూసపాటిరేగలోని చాకలివీధికి చెందిన మామిడి సత్యకుమార్, గురాన భార్గవ్‌లుగా గుర్తించి అరెస్టు చేసి, వారి నుంచి బంగారు చైన్, నిందితులు ఉపయోగించిన రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

హోరాహోరీగా ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు



హోరాహోరీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

తెర్లాం: ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు తెర్లాం మండలంలోని విజయరాంపురం గ్రామంలో రెండు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రామంలో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ప్రతిష్ఠ సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఆలయ కమిటీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో పలు గ్రామాలకు చెందిన 38 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేత జట్లకు వరుసగా రూ.20వేలు, 15వేలు, 10వేలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముందే కూసిన కోయిల..!

- బొబ్బిలి టీడీపీ అభ్యర్థిపై కేసు నమోదు

బొబ్బిలి: ఎన్నికల కమిషన్ గత నిబంధనలను సవరించిందని తెలియదో లేక దూసుకువెళ్లిపోదాం అనుకున్నారో గానీ బొబ్బిలి టీడీపీ అభ్యర్థి ఆర్ వీఎస్‌కేకే రంగారావు(బేబినాయన) అనుమతులు తీసుకోకుండా ప్రచారం ప్రారంభించి ఇంటింటికీ తిరిగేశారు. గత ఎన్నికల సమయంలో తన సోదరుడు ప్రారంభించినట్లుగానే ఆయన కూడా సంత తోట నుంచి (రాజానగర్ కాలనీ) ప్రచారాన్ని ప్రారంభించేశారు..కానీ అనుమతులు ఉండాలన్న ఆలోచన చేయలేదు. దీంతో కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ చూసి స్పందించింది. అనుమతులు ఉన్నాయా? లేవా? అని ఆరా తీసిన క్రమంలో అనుమతులు లేవని తేలడంతో ఎస్సై జి.లోవరాజు బేబినాయన ప్రచార యావను గుర్తించి కేసు నమోదు చేశారు. బేబీ నాయనపై కేసట అని పట్టణంలోని అన్ని ప్రాంతాలతో పాటు నియోజకవర్గంలోనూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సీఐ ఎం.నాగేశ్వర రావును వివరణ కోరగా నిబంధనలు ఉల్లంఘించిన మాట వాస్తవమేనని, అదుకే నిబంధనల అతిక్రమణపై బేబినాయనపై కేసు నమోదు చేశారని ఎస్సై జి.లోవరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడి నియామకం

- బర్రి చిన్నప్పన్నకు నియామక పత్రం అందజేత



బర్రి చిన్నప్పన్నకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బర్రి చిన్నప్పన్న నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు.

పుచ్చకాయల వ్యాన్ బోల్తా





గోతిలో పడిన వ్యాన్ (ఇన్‌సెట్లో) నేలపాలైన పుచ్చకాయలు

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తు కానావద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడడంతో పుచ్చకాయలు నుజ్జయిపోయి నేలపాలయ్యాయి. గురువారం రాత్రి సంభవించిన ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రావులపాలానికి చెందిన వ్యాపారి ఎ.గంగారావు కురుపాంలో రైతులనుంచి 10 టన్నుల పుచ్చకాయలు కొనుగోలు చేశారు. అనంతరం విజయవాడకు చెందిన వ్యాన్ బుక్‌చేసుకుని సుమారు లక్ష రూపాయల సరుకు రావులపాలానికి తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. కురుపాం మండల కేంద్రం నుంచి లోడుతో వెళ్తున్న వ్యాన్‌లో ఆయిల్ అయిపోవడంతో ఎత్తైన ప్రాంతం ఎక్కలేక బ్రేక్ విఫలమై రోడ్డుకు అడ్డంగా తిరిగి కొత్తగా కడుతున్న వేబ్రిడ్జి పక్క గోతిలో పడిపోయిందని వ్యాపారి బంధువు చెప్పారు.

ప్రతి నీటిబొట్టూ విలువైనదే

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్

పార్వతీపురం టౌన్: ప్రతి నీటి బొట్టూ ఎంతో విలువైనదని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నీటి ప్రాముఖ్యం గురించి తెలిపారు. సృష్టిలో ప్రతి జీవికి నీటి అవసరం ఎంతో ఉందని, నీటిని వృథా చేయకుండా, అవసరం మేరకు ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన నీటిని మరగబెట్టి చల్లార్చిన తరువాత మాత్రమే తాగాలని హితవు పలికారు. వర్షాకాలంలో నీటిని పొదుపు చేసుకునేందుకు ఇంటిముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. సామాజిక, ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుందని, తాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరమని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, టి.జోగారావు, లోక్ ఆదాలత్ మెంబర్ జి. వెంకటరావు, అడిషనల్ పీపీ ఎం.వెంకటరమణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మూగబోయిన ఆదివాసీ కళాకారుడి గొంతు

- విషాదంలో గిరిజనులు





కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి శతాధిక వృద్ధుడు బాలిమ్మ గొమాంగో (ఇన్‌సెట్లో) మృతుడు రైకన్న(ఫైల్)

భామిని: ఆదివాసీ గిరిజనుల మాతృభాష అయిన సవరభాషలో భక్తి గీతాలు రాసి పాడి సంగీతం జోడించి మైమరిపించే ఆదివాసీ కళాకారుడు నల్లరాయిగూడకు చెందిన బిడ్డిక రైకన్న (52) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. దీంతో ఆయన సంగీతాభిమానులైన ఆదివాసీలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విశాఖలో మృతిచెందిన రైకన్నకు భామిని మండలంలోని నల్లరాయిగూడలో వందలాది మంది ఆదివాసీ గిరిజనుల రోదనల మధ్య శుక్రవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. 16 మంది సంతానంలో చివరి కుమారుడు రైకన్న మృతిని జీర్ణించుకోలేక తండ్రి శతాధిక వృద్ధుడు బాలిమ్మ గొమాంగో కన్నీరుమున్నీరు కావడాన్ని చూపరులు జీర్ణించుకోలేకపోయారు. ఏడాది క్రితం ఇంటిలో పెంచిన కుక్క కరవడంతో రేబిస్ వ్యాధికి రైకన్న గురయ్యాడంటూ బోరున విలపిస్తూ కుటుంబసభ్యులు తెలిపారు. గిరిజన యువతకు ఉచితంగా సంగీతం నేర్పించేవాడని గుర్తు చేసుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, 8 మంది సోదరులు, ఏడుగురు సోదరీమణులున్నారు. మృతుడి సోదరులందరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడం విశేషం.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామిని పల్లకిలో ఊరేగించి దీపారాధన వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి, స్వామికి ఊంజల్ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210